క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గద్వాల అర్బన్: విద్యుత్ లైన్ల మరమ్మతులు, చెట్లను తొలగించే నేపథ్యంలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ టౌన్ ఏఈ శివకుమార్ మంగళ వారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8గంటల నుంచి 9గంటల వరకు జిల్లా కేంద్రం లోని పాతహౌసింగ్ బోర్డు, వీవర్స్ కాలనీ, 2వ రైల్వేగేటు, ప్రభుత్వాసుపత్రి, రైల్వేస్టేషన్, బీరెల్లి రోడ్డు, వేణుకాలనీ, హమాలీ కాలనీ, న్యూ హౌసింగ్ బోర్డు కాలనీలకు విద్యుత్ సరఫ రాను నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ



ధరూరు: మండలంలోని ఆయా గ్రామాల్లో అం గన్‌వాడీ కేంద్రాలను మండల స్పెషలాఫీసర్ షకీలాబాను తనిఖీ చేశారు. మంగళవారం ఆమె మండల అభివృద్ధి అధికారిణి మంజులతో కలిసి మండలంలోని జాంపల్లి, కోతులగిద్ద గ్రామాల్లో అంగన్‌వాడీ సెంటర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లతో మాట్లాడారు. పిల్లల సంఖ్య, సెంటర్‌కు పౌష్టికాహారం అందుతుందా లేదా? అని ఆరా తీశారు. కోతులగిద్ద అంగన్‌వాడీ సెంటర్ పాత భవనంలా ఉందని, ఏవైనా ఇబ్బందులు ఉన్నాయా అని తెలుసుకున్నారు. జాంపల్లిలో మొక్కలు నాటారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయం వద్ద మొక్కలు నాటించాలన్నారు. ఖాళీ ప్రదేశాలను గుర్తించి మొక్కలు నాటించే కార్యక్రమం చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. గ్రామాల్లో అన్ని శాఖలు సమన్వయంతో పని చేసి సమస్యలను పరిష్కరించాలన్నారు.

మల్దకల్‌లో సప్తాహ భజనలు



మల్దకల్: ఆదిశిలా క్షేత్రంలోని లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో సప్తాహ భజనలు కొనసాగుతున్నాయి. మంగళవారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన భజన మండలి సభ్యులు సప్తాహ భజనలో పాల్గొన్నారు. భజన మండలి సభ్యులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రహ్లాద రావు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

రూరల్ ఎస్‌ఐ పర్వతాలు వీఆర్‌కు అటాచ్

గద్వాల క్రైం: గద్వాల రూరల్ ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న పర్వతాలను వీఆర్‌కు అటాచ్ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. వారి స్థానంలో కోయిలకొండ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న శ్రీకాంత్‌కు స్థానచలనం కల్పిస్తూ 7వ జోన్ ఐజీపీ చౌహాన్ ఆదేశాలు జారీ చేశారు. ఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి ఇసుక, మట్టి ఇతరాత్ర దందాల విషయంలో చూసి చూడనట్లు వ్యవహరించినట్లు ఆరోపణలున్నాయి. మండంలో ఫిల్టర్ ఇసుక డంపులు ఏర్పాటు చేసుకున్న వ్యక్తులపై ప్రజలు ఫిర్యాదులు చేసినప్పటికీ చర్యలు తీసుకోలేదని విమర్శలున్నాయి. నెలరోజుల క్రితం ఫిల్టర్ ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌పై నుంచి కూలీ మృతి చెందిన కేసులో సైతం విచారణలో జాప్యం చేసినట్లు ఆ గ్రామస్తులు ఆరోపించారు. ఎస్‌ఐగా 8నెలలు విధులు నిర్వహించిన నేపథ్యంలో ఉన్నతాధికారులు వీఆర్‌కు అటాచ్ చేస్తూ ఆదేశాలు రావడంతో హాట్‌టాఫిక్‌గా మారింది. ఈ విషయంపై 'సాక్షి' ఎస్‌ఐ పర్వతాలను వివరణ కోరగా, సాధారణ బదిలీలో భాగంగా వీఆర్‌కు అటాచ్ అయినట్లు వెల్లడించారు. వస్తున్న ఆరోపణలపై ఎలాంటి సంబంధం లేదని పేర్కొన్నారు.

రైతు భరోసా ఇవ్వాలి

గద్వాల అర్బన్: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ రైతులకు పెట్టుబడి సాయం కింద ఎకరాకు ఏడాదికి రూ.15వేలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక వాటిని మరిచిపోయారని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ రంజిత్‌కుమార్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆ సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలైనా ఇప్పటి వరకు రైతుభరోసా ఇవ్వకుండా రైతులను మోసం చేసిందన్నారు. సమావేశంలో బుచ్చిబాబు, శ్రీనివాస్ యాదవ్, ప్రేమ్ రాజ్, రంగస్వామి, సర్వేశ్, గోపాల్ ఉన్నారు.

74.6 మి.మీ. వర్షం

గట్టు: మండల కేంద్రంలో మంగళవారం రాత్రి ఉరుములు, మెరుపులతో 74.6 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. మెట్ట పంటలు వాడు పట్టిన తరుణంలో వర్షం కురువడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పర్మినెంట్ చేయాలి

గద్వాల అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం పారిశుద్ధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లెపోగు లక్ష్మణ్ డిమాండ్ చేశా రు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.



ఎర్రవల్లిలో జయశంకర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అడిషనల్ కమాండెంట్ సుబ్రహ్మణ్యం



శాంతినగర్‌లో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకల్లో ఉపాధ్యాయులు

మహనీయుల త్యాగాలు మరువలేనివి

- ఊరూరా ప్రొఫెసర్ జయశంకర్‌కు ఘనంగా నివాళులు
- విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు
- జయశంకర్ సేవలను స్మరించుకున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రజలు

గద్వాల అర్బన్: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాటం చేసిన మహనీయుల త్యాగాలు మరువలేనివని టీజేఎస్ జిల్లా కన్వీనర్ అలూరు ప్రకాష్ గౌడ్ అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ జయంతి జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో జయశంకర్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో టీజేఎస్ నాయకులు రామ్మోహన్, భద్రప్ప తదితరులు ఉన్నారు.

జిల్లా కేంద్రంలోని ఎంఏఎల్‌డీ డిగ్రీ కళాశాల, ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలల్లో జయశంకర్ జయంతి ఘనంగా నిర్వహించారు. జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డిగ్రీ ప్రిన్సిపల్స్ డాక్టర్ షేక్ కలందర్ బాషా, లక్ష్మీప్రసాద్ మాట్లాడారు. అనంతరం మహిళ డిగ్రీ కళాశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నాగర్‌దొడ్డి వెంకట్రాములు, మధుసూదన్ బాబు, ఆంజనేయులు, వెంకటస్వామి, మోహన్, వెంకట్‌రెడ్డి, అతిఖార్ రహ్మాన్, వినోద్, కుర్వపల్లయ్య, శివ, రంజిత్ ఉన్నారు.

అలంపూర్: తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రొఫెసర్ జయశంకర్ సేవలు చిరస్మరణీయమని మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో జయశంకర్ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ, ప్రత్యేక అధికారి శ్రీధర్ రెడ్డి, కమిషనర్ సరస్వతి, కౌన్సిలర్లు హాజరయ్యారు. మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: తెలంగాణ రాష్ట్ర సిద్ధాంత కర్త, రాష్ట్ర సాధన కోసం నిరంతరం శ్రమించిన ప్రొఫెసర్ జయశంకర్ సార్ ఆశయాలను ప్రతి ఒక్కరూ కొనసాగించాలని పదో పటాలం అడిషనల్ కమాండెంట్ సుబ్రహ్మణ్యం అన్నారు. ఎర్రవల్లి మండలంలోని బీచుపల్లి పదో పటాలంలో జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్‌ఐలు రాజు, ఆర్‌పీ సింగ్, రాజారావు, గోపాల్, వెంకటేశ్వర్లు, సిబ్బంది ఉన్నారు.

అయిజ: మున్సిపాలిటీ కార్యాలయంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణంలోని ఎమ్మార్సీ కార్యాలయం ఆవరణలో జయశంకర్ విగ్రహానికి ఎస్‌జీటీయూ సభ్యులు, వివిధ సంఘాల, పార్టీల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న, ఇన్‌చార్జి కమిషనర్ లక్ష్మారెడ్డి, ఏఈ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

శాంతినగర్: ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని వడ్డేపల్లి ఎంఆర్‌సీ కార్యాలయం ముందు నిర్వహించారు. పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శేషన్న, రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకట్రావు, సీనియర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ధరూరు: మండల కేంద్రంలో జీహెచ్‌ఎం ప్రతాప్ రెడ్డి జయశంకర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గట్టు: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇన్‌చార్జి ప్రిన్సిపల్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ అధికారి కేఎస్‌డీ రాజు ఆధ్వర్యంలో జయశంకర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో లెక్చరర్లు శ్యాం సుందర్, రంగస్వామి, మహేష్, భరత్‌కుమార్, శ్రీజ, సుప్రజ, విద్యార్థులు పాల్గొన్నారు. రాయాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో కాంప్లెక్స్ హెడ్మాస్టర్ నల్లారెడ్డి జయశంకర్ జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో హెడ్మాస్టర్ అశ్విని, ఉపాధ్యాయులు ఖాజామీర్, వీరేష్, బద్రుద్దీన్, రాజుసాగర్, బుడ్డప్ప, రమేష్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

మల్దకల్: మండలంలో జయశంకర్ జయంతిని నాయకులు, అధికారులు ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ పంచాయతీ, ప్రభుత్వ పాఠశాలలో జయశంకర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంఈఓ సురేష్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



గద్వాలలో ప్రొఫెసర్ జయశంకర్, గద్దర్ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న టీజేఎస్ నాయకులు



అయిజ మున్సిపాలిటీలో జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు



మల్దకల్‌లో జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న ఇన్‌చార్జి ఎంఈఓ సురేష్



అలంపూర్‌లో జయశంకర్ జయంతి వేడుకల్లో చైర్‌పర్సన్ మనోరమ, అధికారులు

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటండి



కొంకలలో మొక్క నాటుతున్న ఆర్డీఓ రవీందర్



అలంపూర్‌లో మొక్క నాటుతున్న చైర్‌పర్సన్ మనోరమ, మున్సిపల్ అధికారులు

శాంతినగర్: వానాకాలంలో మొక్కలు బాగా పెరుగుతాయని, ప్రతి ఒక్కరూ ఇంటి ఆవరణలో మొక్కలు నాటాలని ఆర్డీఓ రవీందర్ పిలుపునిచ్చారు. వడ్డేపల్లి మండలంలోని కొంకల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో స్వచ్ఛదనం-పచ్చదనంలో భాగంగా మొక్కలు నాటారు. అనంతరం ఎంవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన 'బడిపిల్లలను పని పిల్లలుగా కానీయవద్దు' అనే పోస్టర్లను ఆర్డీఓ విడుదల చేయించారు. అంగన్‌వాడీ సెంటర్‌ను సందర్శించారు. వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పైపాడు యూపీఎస్ పాఠశాలలో ఎంవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు లైబ్రరీ పుస్తకాలు, గేమ్స్ మెటీరియల్ ఆర్డీఓ పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా డీపీఎం రూతమ్మ, ఎంపీడీఓ ప్రవీణ్, ఏపీఎం మహేష్, ఎంవీ ఫౌండేషన్ మండల కోఆర్డినేటర్ హనిమిరెడ్డి, ఏపీసీ చైర్మన్ లక్ష్మీదేవి, ప్రధానోపాధ్యాయులు శివ, సీఆర్‌పీఎఫ్ సభ్యులు పాల్గొన్నారు.

అలంపూర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనంతో ప్రతివార్డును పరిశుభ్రంగా ఉండేలా చూడాలని మున్సిపల్ ప్రత్యేక అధికారి శ్రీధర్‌రెడ్డి అన్నారు. అలంపూర్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో స్వచ్ఛదనం-పచ్చదనంలో భాగంగా ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి మున్సిపల్ ప్రత్యేక అధికారి శ్రీధర్‌రెడ్డి, చైర్‌పర్సన్ మనోరమ, కమిషనర్ సరస్వతిలు హాజరై మాట్లాడారు. మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, వార్డుల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: ప్రతి ఇంటి ఆవరణలో మొక్కలు నాటాలని మండల ప్రత్యేక అధికారి లక్ష్మణ్ అన్నారు. ఎర్రవల్లి మండలంలోని ఎర్రవల్లి, బీచుపల్లి, తిమ్మాపురం గ్రామాలను ఎంపీడీఓ అజార్ మొహియుద్దీన్ స్వచ్ఛదనం-పచ్చదనంపై ప్రజలకు అవగాహన కల్పించి మాట్లాడారు. కార్యక్రమంలో ఏపీఓ, ఏపీఎం, టీఏలు, కార్యదర్శులు, ఆశాలు, అంగన్‌వాడీలు, ప్రజలు ఉన్నారు.

అయిజ: స్వచ్ఛదనం-పచ్చదనం విజయవంతం చేసి పర్యావరణాన్ని కాపాడుకుందామని డీఆర్‌డీఓ నరసింగరావు అన్నారు. మండలంలోని ఈడుగోనిపల్లిలో ఈజీఎస్ సిబ్బందితో కలిసి స్వచ్ఛదనం-పచ్చదనంలో డీఆర్‌డీఓ పాల్గొన్నారు. ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఈజీఎస్ సిబ్బందికి సూచించారు. మండంలోని కొత్తపల్లి, రాజాపురం, బైనిపల్లి గ్రామాల్లో ఎంపీడీఓ వెంకటయ్య స్వచ్ఛదనం-పచ్చదనం నిర్వహించారు.

కేటీదొడ్డి: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఏఎన్‌ఎం నాగవేణి సూచించారు. మండలంలోని ఇర్కిచేడులో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు.

ధరూరు: గ్రామాల్లో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని ఎంపీడీఓ మంజుల అన్నారు. స్వచ్ఛదనం-పచ్చదనంలో భాగంగా దోర్నాలలో ప్రాథమిక పాఠశాల, గ్రామ పంచాయతీల వద్ద మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు.

గట్టు: మన చుట్టూ ఉండే పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని ఎంపీడీఓ చెన్నయ్య కోరారు. స్వచ్ఛదనం-పచ్చదనంలో భాగంగా తుమ్మలపల్లిలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం వాటర్ ట్యాంకును, వీధులను పరిశీలించారు.

మానవపాడు: మండలంలోని కేజీబీవీలో స్వచ్ఛదనం- పచ్చదనం ఎస్‌ఓ అనురాధ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులు, సిబ్బంది ఉన్నారు.



తుమ్మలపల్లిలో అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ చెన్నయ్య



మానవపాడు కేజీబీవీలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు

ప్రభుత్వ ఆస్పత్రిలోనే కాన్పులు జరగాలి

అలంపూర్ రూరల్: ప్రభుత్వ ఆస్పత్రిలోనే కాన్పులు జరిగేలా గర్భిణులకు అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి మాత శిశుసంరక్షణ జిల్లా అధికారి డాక్టర్ ప్రసూనరాణి సూచించారు. మండలంలోని క్యాతూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళ వారం ఆశా డే సందర్భంగా ఆశా, వైద్య సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. క్షయ వ్యాధిగ్రస్తులను త్వరగా గుర్తించి వారికి సకాలంలో మందులు పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి మండల వైద్యాధికారిణి ప్రతిభాస్ఫూర్తి, ఎంపీహెచ్‌ఈఓ సత్యనారాయణ, హెచ్‌ఎస్ ఉలిగమ్మ, హెచ్‌ఏ సువర్ణకుమారి, పీఎస్ దేవిక, హెచ్‌ఏ బాలీశ్వరయ్యశెట్టి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ ప్రసూనరాణి

పేదింటి ఆడపడుచులకు ప్రభుత్వం అండ



కల్యాణలక్ష్మీ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గట్టు: పేదింటి ఆడపడుచులకు అండగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఉందని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. మండలంలో మొత్తం 197 మంది లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రెండోసారి ఎమ్మెల్యేగా గెలిపించినందుకు ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. సీఎం సహకారంతో మరింత అభివృద్ధిని చేసుకుంటామన్నారు. గట్టు లిఫ్టు 60 శాతం పనులు పూర్తయినట్లు తెలిపారు. మిగిలిన పనులు త్వరలో పూర్తి చేసి, బీడు భూములకు సాగు నీటిని అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ సరితారాణి, జిల్లా గ్రంథాలయాల సంస్థ మాజీ చైర్మన్ జంబురామన్‌గౌడు, మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేష్, కాంగ్రెస్ నాయకులు రామకృష్ణారెడ్డి, రామాంజనేయులు, గౌస్, మహబూబ్ పాష, రాముశెట్టి, మోహన్‌గౌడు, తిమ్మప్ప, రాజప్ప, రాముడు, సంతోష్ పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

సీఎం సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అందజేశారు. మహిళా సమాఖ్య భవనం దగ్గర ఎమ్మెల్యే మొక్కను నాటారు.

కొర్ర పంట ధ్వంసం

అయిజ: రైతు సాగుచేసిన కొర్ర పంటను గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేసిన సంఘటన మండలంలోని తూంకుంట సమీపంలో చోటుచేసుకుంది. బాధితుల వివరాల ప్రకారం.. పట్టణంలోని కోట్ల వీధికి చెందిన ముల్ల షమీం మూడెకరాల పొలంలో కొర్రపంటను సాగుచేశాడు. మంగళ వారం షమీం పంటపొలానికి వెళ్లిచూడగా, సుమారు ఎకర విస్తీర్ణంలో కొర్ర పంటను గుర్తుతెలియని వ్యక్తులు పీకివేసినట్లు గమనించాడు. తొలగించిన పంట సుమారు రూ.80 వేలు ఉంటుందని పేర్కొన్నాడు.

పడకేసిన ప్రత్యేక పాలన

- చెత్తాచెదారం నిండిన మురుగు కాల్వలు
- దోమకాటుతో గ్రామస్తుల విలవిల
- పారిశుద్ధ్య నిర్వహణ పట్టని అధికారులు
- చర్యలు చేపట్టాలని ప్రజల డిమాండ్

ప్రస్తుతం పల్లెల్లో అపరిశుభ్రత తాండవిస్తోంది. ప్రత్యేక పాలన అధికారుల పర్యవేక్షణ కరువైంది. దీంతో గ్రామాల్లో చెత్తాచెదారం గుట్టలుగా పేరుకుపోతున్నాయి. పట్టించుకునే వారు లేకపోవడంతో సీజనల్ వ్యా ధులు ప్రబలనున్నాయి. రోగాల బా రిన పడ్డ జనం ఆస్పత్రికి పరుగులు పెడుతు న్నారు. కేటీదొడ్డి మండలంలోని 23గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక పాలన పడకేసింది.

కేటీదొడ్డి: మండల కేంద్రంలోని నందిన్నె, ఇర్కిచేడు, ఉమిత్యాలతండా, కొండాపురం, గువ్వలదిన్నె, పాగుంట, చింతలకుంట, మైలగడ్డ, పాతపాలెం, పూజారితండా, తోటతండా తదితర గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక పాలన అధికారుల పర్యవేక్షణ కరువైంది. పారిశుద్ధ్య నిర్వాహణ గాడి తప్పింది. ఆడపాదడపా కురుస్తున్న వర్షాలకు రోడ్లపై మురుగు కాల్వలు నిండి రోడ్లపై మురుగు పారుతోంది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మురుగు కాల్వలను శుభ్రం చేయకపోవడంతో దుర్గంధం వెదజల్లుతోందని మండిపడుతున్నారు.

దోమలు, ఈగల బెడద..

ఇళ్ల మధ్య చెత్తాచెదారం పేరుకుపోతుండటంతో దోమలు, ఈగల వల్ల ప్రజలు అల్లాడుతున్నారు. చెత్త కుప్పలు, దట్టంగా పెరిగిన పిచ్చిమొక్కలు, మురుగు దోమలకు ఆవాసంగా మారాయి. దోమకాటుకు వ్యాధులు బారినపడి ఆసుపత్రులకు పరుగులు పెడుతున్నారు.

చేతులెత్తేసిన అధికారులు..

అభివృద్ధి పనులు చేపట్టేందుకు, నిర్వాహణకు గ్రామ పంచాయతీలకు నిధులు లేక ప్రత్యేక పాలనాధికారులు చేతులెత్తేస్తున్నారు. కనీసం పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు చెల్లించలేని దుస్థితి నెలకొంది. పారిశుద్ధ్య కారికులకు వేతనాలు అందకపోవడంతో పనిచేయడానికి ముందుకు రావడం లేదని వాదనలు వినిపిస్తున్నాయి.



కేటీదొడ్డిలో రోడ్డుపై పారుతున్న మురుగునీరు



ఇర్కిచేడులో రోడ్డు పై ఆగిన మురుగునీరు



డ్రెయినేజీ లేక ఇళ్ల మధ్యలో పారుతున్న మురుగు

దోమలతో ఇబ్బంది పడుతున్నాం..



నెలల తరబడి మురుగు కాల్వలు శుభ్రం చేయకపోవడంతో దోమ లు పెరిగిపోతున్నాయి. గ్రామ పంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. దోమ కాటుతో వ్యాధుల బారిన పడి ఆస్పత్రిలో చేరాల్సి వస్తోంది. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పారిశుద్ధ్య పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలి.

– రాజు, కేటీదొడ్డి

చర్యలు తీసుకుంటాం..

గ్రామ పంచాయతీల్లో నిధులు లేక ఇబ్బందులు పడుడుతున్న మాట వాస్తవం. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టేలా దృష్టి సారించాం. ఇప్పటికే గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించాం. 'స్వచ్ఛదనం పచ్చదనం' ఈ నెల 5 నుంచి 9 వరకు నిర్వహిస్తున్నాం. అన్ని గ్రామాల్లో మురుగు కాల్వలు శుభ్రం చేయించి, చర్యలు తీసుకుంటాం.

– కృష్ణమోహన్, ఎంపీఓ, కేటీదొడ్డి

అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు



అలంపూర్ రూరల్: మండలంలోని క్యాతూర్ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు మంగళ వారం నిర్వహించారు. ఎంపీహెచ్‌ఈఓ సత్యనారాయణ హాజరై మాట్లాడుతూ తల్లికి మొదటి పాలు ముర్రుపాలుగా పరిగణిస్తారని, వాటిని తాగించడం వల్ల బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో పంపిణీ చేసిన బాలమృతం, గుడ్లను, ప్రతి బిడ్డకు రెండు సంవత్సరాల పాటు తల్లిపాలను అందించాలని సూచించారు. తల్లి పాలు ఇవ్వకపోతే బిడ్డ ఇమ్యూనిటీ పవర్ తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు అలరాణెమ్మ, గోవిందమ్మ, సత్యమ్మ, రుక్మిణి వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గద్దర్ వర్ధంతి



గద్వాల అర్బన్/అయిజ: ప్రజా గాయకుడు గద్దర్ మొదటి వర్ధంతిని గద్వాల, అయిజలో వివిధ పార్టీల, సంఘాల నాయకులు మంగళవారం నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్‌లో గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాల నాయకుడు వినోద్ మాట్లాడారు. ప్రజా యుద్ధనౌక గద్దర్ ప్రజల సమస్యలపై పోరాటాలు చేస్తూ తన ఆటపాటలతో ప్రజలను చైతన్య పరిచి ఉర్రూతలూగించారని కొనియాడారు. గద్దర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో స్వామిదాసు, మునెప్ప, రంగన్న, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంకండి

గద్వాల అర్బన్: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సీపీఎం తరుపున పోటీ చేసే కార్యకర్తలు సిద్ధం కావాలని జిల్లా కార్యదర్శి వెంకటస్వామి సూచించారు. మంగళవారం జిల్లా కేంద్రంలో జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించి మాట్లాడారు. జిల్లాలోని ప్రజా సమస్యలపై సీపీఎం నిరంత రం పోరాటం చేస్తుందన్నారు. అధికార పార్టీ ప్రజాప్రతినిధుల వర్గపోరులో ప్రజాసమస్యలు గాలికొదిలేశారని, విభేదాలను పక్కనబెట్టి ప్రజా సమస్యలపై దృష్టి సారించి జిల్లా అభివృద్ధికి పాటుపడాల ని హితవు పలికారు. సమావేశంలో సీపీఎం నాయకులు రేపల్లె దేవదాస్, వీవీ నర్సింహ ఉన్నారు.

అండగా నిలుస్తూ..

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని రాఘవేంద్ర కాలనీలో నివాసముంటున్న మోహన్ కుమార్తె దీప్తికి ఫీజు కట్టేందుకు సోషల్ రెస్పాన్సిబులిటీ బృందం సభ్యులు మంగళవారం విద్యార్థిని తండ్రికి రూ. 35 వేలు ఆర్థిక సాయం చేశారు. ధరూరు మెట్టుకు చెందిన డయాబెటిస్‌తో బాధపడుతున్న అమ్మాయికి మందులకు రూ.32,141 సాయం అందజేశారు. కార్యక్రమంలో సోషల్ రెస్పాన్సిబులిటీ బృందం సభ్యులు అశోక్, శ్రీనివాస్, నాగేష్, సంజీవ్, ఆంజనేయులు, చందు, మురళీ, తదితరులు ఉన్నారు.

నేడు చెక్కుల పంపిణీ

మానవపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లో కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు బుధవారం కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ ఉంటుందని తహసీల్దార్ వాహీదా ఖాతూన్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.